జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 49 ॥ గురువారం ॥ 16-7-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



16 జూలై 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:54 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి విదియ ఉ. 8:55 వరకు తరువాత తదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఆశ్లేష రా. 7:54 వరకు తరువాత మఖ యోగం సిద్ధి రా. 1:20 వరకు కరణం కౌలవ ఉ. 8:55 వరకు తైతుల రా. 7:41 వరకు వర్జ్యం ఉ. 9:33 నుండి ఉ. 11:01 వరకు దుర్ముహూర్తం ఉ. 10:12 నుండి ఉ. 11:04 వరకు మ. 3:23 నుండి సా. 4:14 వరకు రాహుకాలం మ. 1:59 నుండి మ. 3:36 వరకు యమగండం తె. 5:54 నుండి ఉ. 7:31 వరకు గుళికాకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:45 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:18 నుండి తె. 5:06 వరకు అమృత ఘడియలు రా. 7:03 నుండి రా. 8:32 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# గ్రామాల్లో సామరస్యం, ధర్మ పరిరక్షణే లక్ష్యం

## త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

గ్రామాల్లో ధర్మ పరిరక్షణతో పాటు ప్రజల్లో భక్తి భావం, పరస్పర సామరస్యం పెంపొందించడమే "శ్రీరామ హృదయం" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ బ్లాంకెట్ హాల్‌లో నిర్వహించిన "శ్రీరామ హృదయం" సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని కరుణ, ఆశీర్వాదాలు ప్రతి గ్రామానికీ చేరేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా గ్రామాల్లో భక్తి, ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

సూర్యాపేట, జూలై 15 వికాస తరంగిణి సేవకులు ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఏకోత్తర సహస్ర కలశాభిషేకం (1001 కలశాలతో అభిషేకం) విశిష్టమైన ఆధ్యాత్మిక మహోత్సవమని, శాస్త్రోక్తంగా సిద్ధం చేసిన పవిత్ర ద్రవ్యాలతో నిర్వహించే ఈ కలశాభిషేకం ద్వారా దైవానుగ్రహం లభిస్తుందని (మిగతా 2వ పేజీలో)




# సీసీఐపై సప్పుడు లేదు!

## రాష్ట్రం నుంచి స్పందన లేదని కేంద్ర మంత్రి అన్నారు

## వెంటనే మైనింగ్ లీజును పొడిగించాలి: కేటీఆర్


న్యూఢిల్లీ: సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు,ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబా ద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు తరువాయి 2 వ పేజీలో...



# అమెరికాలో 'ట్రంప్' కాయిన్

## 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల

వాషింగ్టన్: అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం 250 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ఆ దేశ అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో కొత్త ఒక డాలర్ నాణేన్ని ముద్రించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ మింట్ ప్రకటిం చింది. ఈ విషయాన్ని తరువాయి 2 వ పేజీలో...



# తెలంగాణ రైజింగ్‌కు.. అమర రాజా బలం

## దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి చేర్చడమే ప్రభుత్వ లక్ష్యం: రేవంత్ రెడ్డి

తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (సీక్యూఫీ) తయారీ యూనిట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్లాంట్‌ను పరిశీలించి ఆవరణలో మొక్క నాటారు. నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ అమర రాజా వంటి ప్రపంచస్థాయి సంస్థలు తెలంగాణ రైజింగ్--2047 లక్ష్య సాధనలో కీలక భాగస్వాములని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్, జూలై 15 అమర రాజా సంస్థ 1983లో చిత్తూరు జిల్లాలో తొలి యూనిట్‌ను ప్రారంభించి నేడు ప్రపంచస్థాయి సంస్థగా ఎదిగిందని, చైనా, జపాన్, జర్మనీ, కొరియా వంటి దేశాల సాంకేతికతను ఆదర్శంగా తీసుకుని ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో చైనాతో పోటీ పడుతున్న సంస్థగా గుర్తింపు పొందిందని కొనియాడారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఈవీ రంగం మరింత ప్రాధాన్యం సంతరించుకుందని, కాలుష్య నియంత్రణలో విద్యుత్ వాహనాల పాత్ర కీలకమని చెప్పారు. దివిటిపల్లి యూనిట్‌లో ప్రస్తుతం 700 మంది పనిచేస్తుండగా, అందులో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వాల పరిశ్రమల విధానాల్లోని మంచి అంశాలను కొనసాగిస్తూ, మరింత మెరుగైన పారిశ్రామిక, పర్యాటక, ఆరోగ్య విధానాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తమ ప్రభుత్వానికి పాలసీ ప్యారాలిసిస్ లేదని, పారదర్శక విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉన్నప్పటికీ, దానిని 10 శాతానికి పెంచడమే లక్ష్యమని తెలిపారు. పరిశ్రమల(మిగతా 2వ పేజీలో)



# తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

## 3 వరకు దరఖాస్తుల స్వీకరణ

## ఆగస్టు 10న ముసాయిదా, అక్టోబర్ 12న తుది జాబితా

తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది. తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు.

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో తరువాయి 2 వ పేజీలో...

# అమెజాన్‌తో ఫ్యూచర్ సిటీకి ఊపు

## 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి



# పోలీసుల వైఫల్యం వల్లే షాబాద్ ఘటన

## బాధితులకు రక్షణ కల్పించలేకపోయారు... సీఎం రేవంత్‌కు పవన్ కల్యాణ్ లేఖ

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు.



మంగళగిరి/హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ తరువాయి 2 వ పేజీలో...



# ఇదేనా మహిళలకు రక్షణ?

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం

హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళల భద్రత పూర్తిగా గాలికి కొట్టుకుపోయిందని, ఆడబిడ్డలను కాపాడుకునే నాథుడే కరవయ్యాడని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ దారుణ ఉదంతంపై ఆయన మాట్లాడారు. ఈ కేసులో ప్రభుత్వం, పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వ్యవహరించిన తీరు సరిగా లేదని ఆరోపించారు. మే 16వ తేదీనే బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని... నిందితుడు ఎవరో, ఏం చేశాడో వివరించినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. నిందితుడు ముందస్తు బెయిల్ తెచ్చుకునే వరకు కూడా అతన్ని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. ఎల్‌బీ నగర్ పోక్సో కోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌ను తాను పరిశీలించానని, అందులో చనిపోయిన బాలిక సోదరుడు తరువాయి 2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

**మేషం :** ప్రారంభించిన పని పూర్తయ్యే వరకు పట్టుదల వదలకండి. ఆర్థికంగా, సామాజికంగా మంచి ఫలితాలు ఉంటాయి. సమాజంలో పేరుప్రతిష్టలు సంపాదిస్తారు. నమ్మించి మోసం చేసేవారు ఉ ంటారు జాగ్రత్త వహించండి. ఈశ్వర సందర్శనం శుభప్రదం.

**వృషభం :** వ్యాపారంలో అనుకూల ఫలితాలు ఉ న్నాయి. ఒక వ్యవహారంలో డబ్బు చేతికి అందుతుంది. కొత్త వస్తువులు కొంటారు. ఆస్తిని వృద్ధి చేసే క్రమంలో సఫలీకృతులు అవుతారు. తోటివారితో సంతోషంగా గడుపుతారు. ఉద్యోగంలో శ్రమ పెరగకుండా చూసుకుంటే కాలం అనుకూలంగా ముందుకు వెళ్తుంది. సూర్య ధ్యానం శు భప్రదం.

**మిథునం :** అనుకూల ఫలితాలు ఉన్నాయి. ప్రారంభించిన పనిలో పురోగతి ఉంటుంది. కీలక వ్యవహారాల్లో అనుకూల ఫలితాలు ఉంటాయి. లాభదాయక ఫలితాలు ఉంటాయి. ఉత్సాహం తగ్గకుండా చూసుకోవాలి. శని ధ్యానశ్లోకం చదివితే మంచిది.

**కర్కాటకం :** మధ్యమ ఫలితాలు ఉంటాయి. మీ మీ రంగాలలో అనుభవజ్ఞుల సహకారంతో పనులను పూర్తి చేస్తారు. మీ బుద్ధిబలంతో తీసుకునే నిర్ణయాలు శక్తిని ఇస్తాయి. ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. నవగ్రహ ధ్యానం శుభప్రదం.

**సింహం :** శ్రమతో కూడిన ఫలితాలు ఉంటాయి. ఉ ద్యోగ,వ్యాపారాలలో ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేసుకోవడం ద్వారా లక్ష్యసిద్ధి ఉంటుంది. బంధుమిత్రుల సహకారం ఉంటుంది. ఆర్థికంగా బలపడతారు. విష్ణు సందర్శనం ఉత్తమం.

**కన్య :** దైవబలం ఉంది. ఉద్యోగ,వ్యాపారాల్లో ముందుచూపుతో వ్యవహరించాలి. స్థిరాస్తి కొనుగోలు వ్యవహారం లాభిస్తుంది. 'ధైర్యే సాహసే లక్ష్మి' అనే వాక్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగండి, మంచి లాభాలు ఉంటాయి. సూర్య ధ్యానం శుభప్రదం.

**తుల :** ఉద్యోగంలో పై అధికారులతో ఆచితూచి వ్యవహరించాలి. వ్యాపారంలో ఏ పని ప్రారంభించినా ఇట్టే పూర్తవుతుంది. మానసికంగా దృఢంగా ఉంటారు. ఆదాయానికి తగిన వ్యయం ఉంటుంది కాబట్టి పొదుపు సూత్రాన్ని పాటించాలి. సూర్య అష్టోత్తరం చదువుకోవడం శుభప్రదం.

**వృశ్చికం :** గ్రహబలం చాలా బాగుంది. ఉద్యోగంలో అనుకూల ఫలితాలు వస్తాయి. వ్యాపారంలో లాభదాయకంగా ఉంటుంది. ప్రారంభించిన పనిలో మంచి ఫలితాలను అందుకుంటారు. బుద్ధిబలం బాగా పనిచేస్తుంది. మనోధైర్యంతో తీసుకునే నిర్ణయాలు ఫలిస్తాయి. ఈశ్వర సందర్శనం ఉత్తమం.

**ధనుస్సు :** ఉద్యోగంలో మీ పనితీరుకు ప్రశంసలు లభిస్తాయి. ముఖ్యమైన విషయాలకు సంబంధించి పెద్దలను కలుస్తారు, నిర్ణయం మీకు అనుకూలంగా వస్తుంది. ఆర్థిక విషయాలు శు భప్రదంగా ఉన్నాయి. విష్ణు ఆరాధన ద్వారా శుభఫలితాలు కలుగుతాయి.

**మకరం :** గురుబలం రక్షిస్తోంది. దైవానుగ్రహంతో పనులు పూర్తవుతాయి. స్వల్పప్రయత్నంతో ఉద్యోగంలో మంచి ఫలితాలను అందుకుంటారు. ఒక శుభవార్త మీ ఇంట్లో సంతోషాన్ని నింపుతుంది. శ్రీమహాలక్ష్మి సందర్శనం శుభప్రదం.

**కుంభం :** మిశ్రమ కాలం నడుస్తోంది. గ్రహబలం తక్కువగా ఉన్న సమయంలో ప్రయత్నం ఎక్కువగా ఉండాలి. శ్రమకు తగిన ప్రతిఫలం ఉ ంటుంది. కాలాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా ముందుకు సాగండి, సత్ఫలితాలు వస్తాయి. పట్టుదలతో వ్యవహరించి పనులను పూర్తిచేస్తారు. శ్రీరామ సందర్శనం మరింత మేలు చేస్తుంది.

**మీనం :** ఉద్యోగంలో ఉత్సాహంగా ముందుకు సాగితే మంచి ఫలితాలు వస్తాయి. ఆర్థికపరమైన విషయాల్లో ముందుచూపు అవసరం. ఒక సంఘటన మీ మనోబలాన్ని పెంచుతుంది. ఇష్టదైవారాధన శుభప్రదం.






# తెలంగాణ రైజింగ్‌కు.. అమర రాజా బలం

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను వేగంగా కల్పిస్తున్నామని, తెలంగాణను "క్యూర్--ప్యూర్--రేర్" ప్రాంతాలుగా విభజించి ప్రత్యేక విధానాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. "తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్" అని సీఎం స్పష్టం చేశారు.

"ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డనే" అన్న సామెతను ప్రస్తావిస్తూ తాను పాలమూరు బిడ్డనని, ఒకప్పుడు కరువు జిల్లాగా పేరొందిన మహబూబ్‌నగర్ నేడు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచే స్థాయికి చేరుకుందని అన్నారు. జిల్లాలో ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేశామని, బ్లూ కాలర్ ఉద్యోగాల కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్ సంస్థలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

కల్వకుర్తి, భీమా, ఆర్డీఎస్, నెట్టంపాడు వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలు, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై పొరుగు రాష్ట్రంతో చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. త్వరలోనే జిల్లా ప్రజలకు శుభవార్త అందిస్తామని పేర్కొన్నారు. పాలమూరు రైతులు అమర రాజా పరిశ్రమ కోసం భూములు ఇచ్చారని గుర్తుచేస్తూ, వారికి అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంస్థ యాజమాన్యాన్ని కోరారు. కొడంగల్ నియోజకవర్గంలో గతంలో ఆర్ అండ్ బీ మంత్రిగా గల్లా అరుణ మంజూరు చేసిన రహదారులు తనకు రాజకీయంగా ఎంతో ఉ పయోగపడ్డాయని కూడా సీఎం ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, మల్లు రవి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# అమెజాన్‌తో ఫ్యూచర్ సిటీకి ఊపు

హైదరాబాద్, జూలై 15 అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపనతో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని, ప్రపంచ స్థాయి పెట్టుబడులు, పరిశ్రమలకు తెలంగాణ మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

బుధవారం జరిగిన అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తెలంగాణ రైజింగ్--2047" విజన్‌తో రాష్ట్రాన్ని 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వికసిత్ భారత్--2047 లక్ష్యానికి అనుగుణంగా జాతీయ జీడీపీలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ లక్ష్య సాధనలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ కల్పనే ప్రధాన పాత్ర పోషిస్తాయని పేర్కొన్న సీఎం, పరిశ్రమలకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అనుమతులు వేగంగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి నెలా పరిశ్రమల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నామని, అమెజాన్ పెట్టుబడులపై ప్రత్యేకంగా సమీక్షిస్తామని చెప్పారు. 2034 నాటికి అమెజాన్ తెలంగాణలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని ఆకాంక్షించారు. 2025 డిసెంబరులో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 108 దేశాలకు చెందిన మూడు వేల మంది కార్పొరేట్ ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చారని గుర్తు చేశారు. ఆ సదస్సు ఫలితంగానే ఫ్యూచర్ సిటీపై అంతర్జాతీయ సంస్థల దృష్టి మరింత పెరిగిందని, అమెజాన్ డేటా సెంటర్ అందుకు నిదర్శనమని అన్నారు.

పరిశ్రమలు, పర్యాటకం, ఇంధనం, ఆరోగ్యం, క్రీడలు వంటి రంగాలకు ప్రత్యేక విధానాలు రూపొందించామని, యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అమెజాన్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థల రాకతో మరిన్ని బహుళజాతి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా పరిశ్రమలు, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయంతో ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందని పేర్కొన్న సీఎం, ఇప్పుడు కాలుష్యరహిత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు, ఆర్టీసీ బస్సులు, ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చే చర్యలు అదే దిశలో భాగమని వివరించారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించి సమగ్ర అభివృద్ధి ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు తగిన నష్టపరిహారం, ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఆందోళన చేస్తున్న రైతులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కె. లక్ష్మారెడ్డికి సూచించిన ముఖ్యమంత్రి, అభివృద్ధి--రైతు సంక్షేమం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు.

చివరగా అమెజాన్ సంస్థ తెలంగాణలో తన కార్యకలాపాలను మరింత విస్తరించి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామిగా కొనసాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.



## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు.

## ధర్మ పరిరక్షణే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఈ పవిత్ర కలశాలు గ్రామాలకు చేరుకోవడం ద్వారా సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖశాం తులతో జీవించాలని, గ్రామాల్లో ఎలాంటి ఉపద్రవాలు లేకుండా అన్ని వర్గాల ప్రజల మధ్య సామరస్యం, సౌభ్రాతృ త్వం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో అర్చకులు మురళీధరాచార్యులు, రామానుజాచార్యులు, అశో క్ రావు, శ్రీనివాస్ రెడ్డి, భాస్కరరావు, చకీలం వేణుగోపాల్, ఈశ్వర్ రెడ్డి, నిర్మల, విజయకుమార్ గురవయ్య, మల్లికార్జు న్, శ్రీధర్, రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



# సీసీఐపై సప్పుడు లేదు!

మొదటి పేజీ తరువాయి

చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు.

బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పామన్నారు. సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్ వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది.

మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు.

మరి రాష్ట ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా.. చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం.

అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వారు ముందుకొచ్చిమైనింగ్ లీజ్‌ను ఎక్స్‌టెండ్ చేయాలి. రూ.2 వేల కోట్ల పెట్టుబడి అంటే రాష్ట్రప్రభుత్వం తరుపున మీరేం ప్యాకేజీ ఇస్తారో చెప్పాలన్నారు. సీసీఐని పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్ధరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

శ్వేత

సంపాదకీయం

గురువారం 16-7-2026

# నదుల అనుసంధానమే పరిష్కారం

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు,సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు,తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. కేవలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసంధానం ఇందులో ప్రధానమైన సమస్య. మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుండదు. నదులను అనుసంధానించడం, జలరక్షణను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్దతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందానం చేయాలి. అలాగే నీటి సంరక్షణను కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధానమైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్నిరోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు కేటాయించాలి. అప్పుడే దేశం ఎల్‌నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేకపోతే వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది.

ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులంద రికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండల స్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి.

# అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

## గ్లోబల్ గుర్తింపు దిశగా మరో అడుగు.. యూఎన్ హ్యాబిటాట్‌తో ఏపీ ప్రభుత్వం ఎంఓయూ



అమరావతి, జూలై 15: రాష్ట్రంలో సమ్మిళిత పట్టణాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐక్యరాజ్యసమితికి చెందిన యూఎన్ హ్యాబిటాట్ మధ్య కీలక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ సమక్షంలో ఈ ఒప్పందంపై ఏపీ పురపాలక శాఖ, యూఎన్ హ్యాబిటాట్ ప్రతినిధులు సంతకాలు చేశారు. రోస్బాక్ సింగపూర్ నుంచి వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వర్ణ ఏపీ, రైజ్ ఏపీ, అప్‌లిఫ్ట్ ఏపీ కార్యక్రమాల్లో భాగంగా అమరావతిలో పట్టణ వ్యవహారాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయడం, పట్టణ పేదరిక నిర్మూలన, పట్టణ పేదల జీవనోపాధి మెరుగుదల వంటి అంశాలపై ఈ ఒప్పందం దృష్టి సారించనుంది.

అలాగే ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక, వాతావరణ మార్పులను తట్టుకునే సుస్థిర నగరాల నిర్మాణం, డిజిటల్ గవర్నెన్స్, మున్సిపల్ ఫైనాన్స్, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతిని ప్రపంచ స్థాయి గ్రీన్‌ఫీల్డ్ నగరంగా తీర్చిదిద్దేందుకు అత్యుత్తమ అంతర్జాతీయ విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం రోడ్‌మ్యాప్‌తో ముందుకు సాగుతోందని, పేదల జీవన ప్రమాణాల పెంపు కోసం పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. అర్బన్ ప్లానింగ్, ఆర్థికాభివృద్ధిపై నెలవారీ ఆర్థిక నివేదికల ఆధారంగా సమీక్షలు నిర్వహిస్తున్నామని, బయోడైవర్సిటీ పరిరక్షణతో పాటు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

అర్బన్ ప్లానింగ్, లివబిలిటీ, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని, డేటా ఆధారిత నిర్ణయాలతో పాలన సాగిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ విధానాలకు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తానని తెలిపారు. యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ మాట్లాడుతూ, అమరావతి నిర్మాణం సీఎం చంద్రబాబు దూరదృష్టికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఏపీ-యూఎన్ హ్యాబిటాట్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ, బహిరంగ ప్రదేశాల అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగంలో మార్పులకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపారు. అలాగే 2028లో మెక్సికోలో జరగనున్న 14వ వరల్డ్ అర్బన్ ఫోరమ్‌లో ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి విజయాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుకు నాదీ భరోసా

## కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడుల అభివృద్ధి

### రూ.వెయ్యి కోట్లతో ఆగస్టు 15 నాటికి 27.50 లక్షల ఎడ్యుకేషన్ కిట్లు

### వనపర్తి జిల్లాలో బాలికల హైస్కూల్ భవనం ప్రారంభించిన సీఎం

కొత్తకోట, జూలై 15: తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులే అత్యంత కీలక పాత్ర పోషించాలని, పలుగు-పార పట్టిన చేతులే కలాలు పట్టి తెలంగాణ రాత మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలని శపథం పూని పనిచేస్తున్నానని ఆయన ప్రకటించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నూతనంగా నిర్మించిన బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించిన సీఎం.. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. గత ప్రభుత్వం విద్యా రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని, కనీస మౌలిక వసతులు లేకపోవడం వల్లే విద్యార్థులు ప్రైవేటు బడుల బాట పట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రస్తుతం ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు.

**ఆగస్టు 15 నాటికి ఎడ్యుకేషన్ కిట్లు**

ప్రభుత్వ బడుల్లో చదివే 27.50 లక్షల మంది విద్యార్థులకు రూ.1000 కోట్లకు పైగా ఖర్చుతో 9 రకాల వస్తువులతో కూడిన తెలంగాణ ఎడ్యుకేషన్ కిట్లను ఆగస్టు 15వ తేదీ లోపు అందిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. కిట్లు అందుకున్న తర్వాత వస్తువుల నాణ్యతపై విద్యార్థులు నేరుగా వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ ఇచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం రాగానే ఉపాధ్యాయులకు 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, పదేళ్లుగా జరగని బదిలీలను చేపట్టామని, 317 జీవోతో చెదిరిపోయిన కుటుంబాలను ఒకచోట చేర్చామని గుర్తుచేశారు. ఈ చర్యలతో కేంద్రం ప్రకటించిన గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 36వ స్థానం నుంచి 18కి ఎదిగిందని, టాప్-2లో నిలిచేలా కృషి చేయాలన్నారు. ఉత్తమ విద్యావిధానం అధ్యయనానికి ఇప్పటికే 50 మంది టీచర్లను విదేశాలకు పంపామని, వచ్చే ఏడాది 150 మందిని పంపుతామన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ప్రతిభ కనబరిచిన టీచర్లకు అవార్డులు ఇస్తామన్నారు.

**బ్లూ కాలర్ జాబ్స్.. క్రీడలకు ప్రోత్సాహం**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవంతో భవిష్యత్తులో వైట్ కాలర్ జాబ్స్ ప్రమాదంలో పడతాయని, అందుకే యువతలో స్కిల్స్ పెంచి బ్లూ కాలర్ జాబ్స్ అందించేలా జర్మన్, జపనీస్ వంటి భాషలు నేర్పిస్తున్నామని సీఎం వివరించారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, మైదానాల్లోనూ పోటీపడాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని, మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్ తరహాలో క్రీడల్లో రాణించే వారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.



# ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢ సారె ఉత్సవాలు

### కనకదుర్గమ్మకు తొలి సారె సమర్పించిన వైదిక సిబ్బంది

### మేళతాళాలు, వేదఘోషల మధ్య వైభవంగా సారె ఊరేగింపు

విజయవాడ, జూలై 15: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం వైదిక సిబ్బంది, స్థానాచార్యులు, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి తొలి సారెను అత్యంత వైభవంగా సమర్పించారు. ఉదయం ఘాట్‌రోడ్డు 'ఓం మలుపు' నుంచి వైదిక సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పసుపు, కుంకుమ, గాజులు, చీర తదితర సారె సంభారాలను నెత్తిన మోసుకుంటూ మేళతాళాలు, కోలాటాలు, వేదమంత్రోచ్చారణల మధ్య శోభాయమానంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. చిన్న రాజగోపురం వద్ద వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

అనంతరం అమ్మవారి మూలవిరాట్ దర్శనం చేసిన వైదిక బృందం మహామండపం ఆరో అంతస్తులోని ఉత్సవమూర్తి సమక్షంలో తొలి సారె సంభారాలను సమర్పించింది. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి లోకక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. సారె సమర్పించిన వైదిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఆషాఢ మాసంలో కనకదుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి సారె సమర్పించడం హైందవ సంప్రదాయంలో విశిష్టమైన ఆచారమని ఆలయ అధికారులు తెలిపారు. ప్రతి ఏడాది వైదిక సిబ్బంది సమర్పించే తొలి సారెతో ఆషాఢ సారె ఉత్సవాలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన స్థానాచార్యులు వి. శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్. దుర్గా ప్రసాద్, కోట ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు బి. శంకర శాండిల్య, కోట రవికుమార్, ఇతర అర్చకులు, వైదిక సిబ్బంది, సంప్రదాయ పాఠశాల విద్యార్థులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు 'పోలీస్ అక్క' అండ

**బాధితులు నిర్భయంగా సమస్యలు చెప్పుకోవాలి: అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి**

**సూర్యాపేట, జూలై 15**



మహిళలు, బాలికలు వేధింపులు లేదా ఇతర సమస్యల విషయంలో ఎలాంటి భయాందోళనలు లేకుండా లిలి'పోలీస్ అక్క'లిలిను సంప్రదించాలని, వారికి చట్టపరమైన రక్షణతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం సూర్యాపేట రూరల్ పోలీసులు, జిల్లా షీ టీం సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని బాలెంల గ్రామ సమీపంలోని తెలంగాణ గురుకుల బాలికల విద్యాలయంలో 'పోలీస్ అక్క' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, బాలికలకు మెరుగైన భద్రత కల్పించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ 'పోలీస్ అక్క' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక మహిళా పోలీసు అధికారిని లిలి'పోలీస్ అక్క'లిలిగా నియమించామని తెలిపారు. ఆమె కుటుంబ సభ్యురాలిలా మహిళలు, బాలికల సమస్యలను ఓపికగా విని, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని వివరించారు.

వ్యక్తిగత, కుటుంబ, సామాజిక లేదా వేధింపులకు సంబంధించిన ఏ సమస్యనైనా మహిళలు, బాలికలు నిర్భయంగా లిలి'పోలీస్ అక్క'లిలితో పంచుకోవచ్చని, బాధితులకు తక్షణ సహాయం అందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు మహిళల భద్రత కోసం షీ టీమ్స్, భరోసా కేంద్రాలు సేవలందిస్తుండగా, ఇకపై 'పోలీస్ అక్క' కార్యక్రమం ద్వారా మరింత చేరువగా సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం పాటలు, నృత్యాల ద్వారా మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి, షీ టీం ఎస్ఐ నీలిమ, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నిపునరుద్ధరించాలి

**జనజాగరణ యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థిత ప్రజ్ఞ డిమాండ్**

**సూర్యాపేట, జూలై 15**




తెలంగాణ రాష్ట్రంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థిత ప్రజ్ఞ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీపీఎస్ జనజాగరణ యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జూలై 11న ప్రారంభమైన ఈ యాత్ర రాష్ట్రంలోని 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో కొనసాగుతోందని తెలిపారు. 207 జాయింట్ యాక్షన్ కమిటీ సంఘాలు, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల మద్దతుతో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు హిమాచల్ ప్రదేశ్‌లో అమలు చేసినట్లే తెలంగాణలో కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఈ హామీ అమలులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 2.6 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. 30 సంవత్సరాల సేవ అనంతరం కూడా సీపీఎస్ ఉద్యోగులకు నెలకు రూ.5 వేల నుంచి రూ.6 వేలలోపే పెన్షన్ లభిస్తోందని, ఇప్పటికే పదవీ విరమణ చేసిన సుమారు 2 వేల మంది ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసిన సీపీఎస్ ఉద్యోగులకు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) కింద ఉచిత వైద్య సేవలు కల్పించాలని, డీఏ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని అన్నారు. ప్రభుత్వం విడుదల చేయనున్న నిధుల్లో సీపీఎస్ ఉద్యోగుల బకాయిలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆగస్టు 23న నిర్వహించనున్న "ఛలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి, రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, జిల్లా కోశాధికారి గుయ్యాని ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ యూసుఫ్, సంయుక్త కార్యదర్శి నారాయణదాసు సతీష్ కుమార్, మామిడి సురేందర్, చిట్యాల సతీష్, సురభి శేఖర్, వీరారెడ్డి, షఫీ, మౌనిష్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మామిడి అరవింద్, ప్రధాన కార్యదర్శి కిషన్ ప్రసాద్, వెంకట్ రెడ్డి, దండుగుల మల్లయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 20 కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

**భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమాలను విజయవంతం చేయాలి: ముదాం శ్రీనివాస్**

**సూర్యాపేట, జూలై 15**



భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సూర్యాపేటలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను పూర్తిగా కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని, సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించకుండా సంక్షేమ బోర్డు ద్వారానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, 55 సంవత్సరాలు పూర్తిచేసుకున్న కార్మికులకు పెన్షన్ అమలు చేయాలని, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించాలని, ఇల్లు లేని భవన నిర్మాణ కార్మికులకు గృహాలు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూలై 20న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా, ఆగస్టు 4న యువ కార్మికుల రాష్ట్ర సదస్సు, ఆగస్టు 10న జైల్ భరో, సెప్టెంబర్ 7న చలో హైదరాబాద్ కార్యక్రమాలను సూర్యాపేట జిల్లాలో పెద్దఎత్తున విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాలో 2026 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలని, సభ్యత్వం ఉన్న ప్రతి గ్రామంలో సంఘ కమిటీలను ఏర్పాటు చేయాలని, యువతతో పాటు మహిళా భవన నిర్మాణ కార్మికులను సంఘటితం చేయాలని సూచించారు. మండల స్థాయిలో రాజకీయ, సంఘ నిర్మాణ శిక్షణ తరగతులు నిర్వహించి కార్యకర్తలను ఉద్యమాలకు సిద్ధం చేయాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించి, కార్మికులను ఐక్యం చేసి పోరాటాలను మరింత ఉధృతం చేయాలని ముదాం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు, సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్, జిల్లా కోశాధికారి కొత్తపల్లి శివకృష్ణ, ఉపాధ్యక్షుడు లకావత్ బాలాజీ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు నార్ల రంగయ్య, ధనావత్ నెహ్రూ, వంగాల శేఖర్, సీహెచ్ నాగరాజు, గుంజ రవీందర్, మాగి లింగయ్య, కుంభం మధు, కొత్తపల్లి కృష్ణ, కోల ఆంజనేయులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు గడ్డం శివ, ఒగ్గు సైదులు, జి. వీరబాబు, మల్లెపాకు సోమయ్య, షేక్ దస్తగిరి, నందిపాటి నరహరి, ఏడుకొండలు, షేక్ నసీరుద్దీన్, సుదర్శన్, కత్తి అంజయ్య, వీరబాబు, మహిళా మండల కన్వీనర్లు జాజుల సావిత్రి, మంజుల, కృష్ణవేణి తదితర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్‌కు ఏర్పాట్లు వేగవంతం

**హైదరాబాద్, జూలై 15**

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి వాహనాల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు ప్రతిపాదిత వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేసే దిశగా ఉన్నతాధికారులు బుధవారం సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) డి. జోయెల్ డేవిస్‌తో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు ఈ తనిఖీలో పాల్గొన్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన పరిశీలించి అగ్రసేన్ జంక్షన్, ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్--45, చెక్‌పోస్ట్, ప్రధాన ప్రవేశద్వారం తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. ఇటీవల నిర్వహించిన ట్రయల్ రన్ సందర్భంగా ఎదురైన సమస్యలను అధికారులు విశ్లేషించారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు ఇరుకుగా ఉండటంతో రద్దీ పెరుగుతోందని గుర్తించి, వెంటనే రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. పాదచారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు. ఇందుకోసం స్పష్టమైన లేన్ మార్కింగ్‌లు, పెలికాన్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్మాణ సంస్థలు పార్కు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కూడా సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్‌వే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసి ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తామని తెలిపారు. పోలీస్ శాఖ సూచించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, ఈ ప్రక్రియలో నగర ప్రజలు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నిర్వహణలో పోలీస్, జీహెచ్ఎంసీ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, నగరవాసులకు ఇబ్బందులు లేకుండా ప్రయాణ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఐదు కొత్త కోర్సులకు యూజీసీ ఆమోదం

**హైదరాబాద్, జూలై 15**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బ్రౌ)కి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఐదు కొత్త విద్యా కార్యక్రమాల నిర్వహణకు ఆమోదం లభించింది. దీంతో విద్య, సామాజిక సేవ, భూగోళ శాస్త్ర విభాగాల్లో విద్యార్థులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఎంఏ ఎడ్యుకేషన్, ఎంఏ ఎడ్యుకేషన్ (స్కూల్ అడ్మినిస్ట్రేషన్), మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ), ఎంఎస్సీ జియోగ్రఫీ కోర్సులతో పాటు బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని పునఃప్రారంభించేందుకు యూజీసీ అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ, కొత్త విద్యా కోర్సులు విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు తమ విద్యార్హతలను మెరుగుపరుచుకోవడానికి, విద్యా నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు శిక్షణ అందించే ప్రణాళిక ఉందని చెప్పారు. ఇంతకుముందు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి కోసం ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాలని బ్రౌను కోరినట్లు యూనివర్సిటీ వెల్లడించింది. కొత్త కోర్సులకు ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే ప్రవేశాలు ప్రారంభించనున్నట్లు యూనివర్సిటీ తెలిపింది.

# టీటీడీ సేవలు అధికారిక వెబ్‌సైట్ ద్వారానే పొందండి

**తిరుమల, జూలై 15**

: శ్రీవారి దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, ఇతర సేవలకు సంబంధించిన బుకింగ్‌లను భక్తులు తప్పనిసరిగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చేసుకోవాలని టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి చి. వెంకయ్య చౌదరి సూచించారు. సామాజిక మాధ్యమాలు, అనధికారిక వెబ్‌సైట్లు, మధ్యవర్తులు ప్రచారం చేస్తున్న తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. కొందరు మోసగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శ్రీవారి దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, టికెట్ల విడుదల, రద్దైన టికెట్ల లభ్యత, వివిధ దర్శనాల వివరాలు, ప్రస్తుత వేచి చూసే సమయం వంటి సమగ్ర సమాచారం టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో నిరంతరం నవీకరించబడుతోందన్నారు. అలాగే ఎస్వీబీసీ ఛానల్ ద్వారా కూడా అధికారిక సమాచారాన్ని భక్తులకు చేరవేస్తున్నట్లు తెలిపారు. టికెట్లకు సంబంధించిన సందేహాల కోసం భక్తులు టీటీడీ కాల్ సెంటర్ 155257ను సంప్రదించాలని సూచించారు. అక్కడ పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యవర్తులకు, అనధికార వ్యక్తులకు డబ్బులు చెల్లించవద్దని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని భక్తులను కోరారు. బుకింగ్‌ల పేరుతో ఎవరైనా మోసానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తే వెంటనే టీటీడీ విజిలెన్స్ ఫిర్యాదు విభాగం 9866898630కు సమాచారం అందించాలని సూచించారు. అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీవారి సేవల్లో పారదర్శకత, భక్తుల భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అన్ని సేవలను అధికారిక మార్గాల ద్వారానే వినియోగించుకోవాలని వెంకయ్య చౌదరి మరోసారి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా ఆచార్య భట్టు రమేష్

**చిలుకూరు, జులై 15:**

చిలుకూరు మండలం జానకి నగర్ తండాకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ ప్రతిష్టాత్మక తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన బుధవారం హైదరాబాద్ లోని అకాడమీ కార్యాలయంలో విధుల్లో చేరారు. తెలుగు భాషా పరిరక్షణ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భూమిక పోషించే తెలుగు అకాడమీ సారధ్య బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్ కు అప్పగించడంపట్ల చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణతో పాటు గ్రామస్తులు, యువకులు,గిరిజన సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య భట్టు రమేష్ కు ఉన్నత విద్యా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధనానుభవం ఉంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అత్యుత్తమ సేవలందించారు. వీటితో పాటు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతిగా, గిరిజన అధ్యయన శాఖ అధిపతిగా, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు. గిరిజన సామాజిక నేపథ్యం నుండి వచ్చిన ఆచార్య రమేష్ జానపద, గిరిజన సంస్కృతుల పరిరక్షణకు విశేష కృషి చేశారు. సమాజ శ్రేయస్సు కోరి వివిధ పబ్లిక్ కమిటీల్లో భాగస్వామ్యం వహించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాలంలో పీపుల్స్ వార్ గ్రూప్, జనశక్తి వంటి పార్టీలతో జరిపిన శాంతి చర్చలలో మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర స్థాయి మద్యపాన నిషేధ సలహా కమిటీ సభ్యుడిగా , గిరిజన భూ రక్షణ చట్టాల పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా సేవలందించారు. వరంగల్ జిల్లాలో గుడుంబా బాధితులైన 200 పైగా గ్రామాల్లోని యువ గిరిజన వితంతువుల సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించి, వారి పునరావాసం కోసం జిల్లా కలెక్టర్ సహాయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. అలాగే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై పని చేసి నివేదికలను అందించి వారి అభివృద్ధికి కృషి చేశారు. ఆయన విద్యా సేవలను గుర్తిస్తూ 2014 లో తెలంగాణ ప్రభుత్వం నుండి 'రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు'ను,అలాగే గిరిజన సాహిత్యం, జానపద కళల రంగంలో ఆయన చేసిన కృషికి గాను 2017లో 'డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు'ను పొందారు. ఈ సందర్భంగా ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా తెలుగు భాషా వికాసానికి, పాఠ్యపుస్తకాల ప్రచురణకు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు తన వంతుగా శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై సీఈవోతో మేధావుల ప్రతినిధి బృందం భేటీ



హైదరాబాద్, జూలై 15

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలపై జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ప్రతినిధి బృందం తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ బృందంలో ఎమ్మెల్సీ కోదండరాం, సీనియర్ జర్నలిస్టులు కొండుభట్ల రామచంద్రమూర్తి, మల్లేపల్లి లక్ష్మయ్య, అమర్ దేవులపల్లి, ఎ. సాయిశేఖర్, మాజీ దూరదర్శన్ అధికారి ఎన్.వి. హనుమంతరావు, జి.కె. మూర్తి, చార్టర్డ్ అకౌంటెంట్ కె.డి. ప్రసాద్, దంతవైద్యుడు డాక్టర్ ఐతరాజు భరత్‌బాబు, ప్రజాసంబంధాల నిపుణుడు వనం జ్వాలా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సందర్భంగా ఓటర్ల పేర్లు తొలగిపోవడం, పేర్ల స్పెల్లింగ్‌లో తప్పులు, 2002 నాటి ఓటరు జాబితా వివరాలను గుర్తించడంలో ఇబ్బందులు, బహుభాషా నమోదు లోపాలు, బూత్ లెవల్ అధికారులకు తగిన శిక్షణ లేకపోవడం వంటి అంశాలను ప్రతినిధి బృందం సీఈవో దృష్టికి తీసుకెళ్లింది. తుది ఓటరు జాబితాలో తమ పేర్లు ఉంటాయో లేదో అన్న ఆందోళన ప్రజల్లో పెరుగుతోందని పేర్కొంది. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. ఎన్నికల అవసరాల కోసం శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం జారీ చేయడం, దరఖాస్తుల గడువు పొడిగించడం, ముఖ్యంగా వృద్ధులు, డిజిటల్ సేవలు వినియోగించలేని వారికి అనుకూలంగా ప్రక్రియను మరింత సరళీకరించాలని ప్రతినిధి బృందం సూచించింది. ప్రతినిధి బృందం చేసిన సూచనలు, ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చారు.

# టీటీడీ సేవలు అధికారిక వెబ్‌సైట్ ద్వారానే పొందండి

తిరుమల, జూలై 15



శ్రీవారి దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, ఇతర సేవలకు సంబంధించిన బుకింగ్‌లను భక్తులు తప్పనిసరిగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చేసుకోవాలని టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి చి. వెంకయ్య చౌదరి సూచించారు. సామాజిక మాధ్యమాలు, అనధికారిక వెబ్‌సైట్లు, మధ్యవర్తులు ప్రచారం చేస్తున్న తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. కొందరు మోసగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శ్రీవారి దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, టికెట్ల విడుదల, రద్దైన టికెట్ల లభ్యత, వివిధ దర్శనాల వివరాలు, ప్రస్తుత వేచి చూసే సమయం వంటి సమగ్ర సమాచారం టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో నిరంతరం నవీకరించబడుతోందన్నారు. అలాగే ఎస్‌వీబీసీ ఛానల్ ద్వారా కూడా అధికారిక సమాచారాన్ని భక్తులకు చేరవేస్తున్నట్లు తెలిపారు. టికెట్లకు సంబంధించిన సందేహాల కోసం భక్తులు టీటీడీ కాల్ సెంటర్ 155257ను సంప్రదించాలని సూచించారు. అక్కడ పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యవర్తులకు, అనధికార వ్యక్తులకు డబ్బులు చెల్లించవద్దని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని భక్తులను కోరారు. బుకింగ్‌ల పేరుతో ఎవరైనా మోసానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తే వెంటనే టీటీడీ విజిలెన్స్ ఫిర్యాదు విభాగం 9866898630కు సమాచారం అందించాలని సూచించారు. అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీవారి సేవల్లో పారదర్శకత, భక్తుల భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అన్ని సేవలను అధికారిక మార్గాల ద్వారానే వినియోగించుకోవాలని వెంకయ్య చౌదరి మరోసారి విజ్ఞప్తి చేశారు.

# ఆగస్టు 29, 30న 15వ ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్

హైదరాబాద్, జూలై 15

హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, ఎన్ఎండీసీ లిమిటెడ్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న 15వ ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో జరగనుంది. ఈ మెగా క్రీడా వేడుకలో 32 వేల మందికి పైగా పరుగుపందెం ప్రేమికులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు, దేశంలోని ప్రముఖ రన్నర్లు, వేలాది మంది ఫిట్‌నెస్ అభిరుచి గలవారు ఈ పోటీల్లో పాల్గొంటారు. ప్రపంచ అథ్లెటిక్స్ గుర్తింపు పొందిన ఈ మారథాన్‌లో మొత్తం రూ.45 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నారు. అలాగే భారతదేశంలోనే తొలి వరల్డ్ అథ్లెటిక్స్ సిల్వర్ సస్టైనబిలిటీ అవార్డు పొందిన మారథాన్‌గా ఈ పోటీ ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈసారి దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఇన్‌క్లూజివ్ రన్ నిర్వహించనున్నారు. అడ్వెంచర్స్ బియాండ్ బారియర్స్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో 300 మందికి పైగా దివ్యాంగులు ఇందులో పాల్గొంటారు. మహిళలకు సురక్షితమైన, సమాన అవకాశాలు కల్పిస్తున్నందుకు ఈ మారథాన్‌కు షీరేసెస్ గుర్తింపు కూడా లభించింది. మారథాన్ ముగింపు పతకం (ఫినిషర్స్ మెడల్), అధికారిక టీ--షర్ట్‌ను ఎన్ఎండీసీ డైరెక్టర్ (పర్సనల్) కృష్ణకుమార్ ఠాకూర్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీపాద్ షెండే ఆవిష్కరించారు. ఈ మారథాన్ సామాజిక సేవకు కూడా వేదికగా నిలుస్తోంది. 40 స్వచ్ఛంద సంస్థలు ఇందులో భాగస్వామ్యం కాగా, ఇప్పటికే రూ.2.03 కోట్ల నిధులు సమీకరించాయి. మొత్తం రూ.4 కోట్ల నిధుల సేకరణ లక్ష్యంగా నిర్వాహకులు ముందుకు సాగుతున్నారు. ప్రధాన మారథాన్ పోటీలు ఆగస్టు 30న పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమై గచ్చిబౌలి స్టేడియంలో ముగుస్తాయి.

# వరంగల్ విమానాశ్రయం పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వమే కారణం: బీజేపీ

హైదరాబాద్, జూలై 15



వరంగల్ మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ కృషే ప్రధాన కారణమని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్ రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ ఒప్పందంలో ఉన్న 150 కిలోమీటర్ల ప్రత్యేక హక్కు (ఎక్స్‌క్లూజివిటీ) నిబంధనకు కేంద్ర ప్రభుత్వం ఒకసారి మినహాయింపు పొందడం వల్లే మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి మార్గం సుగమమైందన్నారు. దేశంలో పౌర విమానయాన రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. “ఉడాన్” (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం ద్వారా సామాన్య ప్రజలకు విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రాంతీయ అనుసంధానాన్ని గణనీయంగా విస్తరించారని తెలిపారు. మామునూరు విమానాశ్రయ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2021 నుంచే కృషి చేస్తోందని రామ్‌చందర్ రావు వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉన్నప్పటికీ అమలు చేయలేదని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. విమానాశ్రయ నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా తెలంగాణ ప్రభుత్వం అవసరమైన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం భూములను అప్పగించిన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలో విమానయాన రంగ విస్తరణకు కేంద్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని, వరంగల్ విమానాశ్రయం ప్రారంభం ద్వారా ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు.

# ఎఫ్‌టీసీసీఐ నూతన అధ్యక్షుడిగా కేకే మహేశ్వరి బాధ్యతలు

హైదరాబాద్, జూలై 15

తెలంగాణ వాణిజ్య, పారిశ్రామిక రంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా కృష్ణకుమార్ (కేకే) మహేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్ గారిమెళ్ల ఎన్నికయ్యారు. 109 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎఫ్‌టీసీసీఐకి ఒక సంవత్సరం పాటు మహేశ్వరి నాయకత్వం వహించనున్నారు. ఆయన మాజీ అధ్యక్షుడు ఆర్. రవికుమార్ స్థానంలో బాధ్యతలు చేపట్టారు. సీఐఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న కేకే మహేశ్వరికి ఆర్థిక రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. పరిశ్రమలు, వాణిజ్యం, పెట్టుబడుల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు విశేషమని సంస్థ పేర్కొంది. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శ్రీనివాస్ గారిమెళ్ల పారిశ్రామికవేత్తగా, ఆటోమేషన్ రంగ నిపుణుడిగా గుర్తింపు పొందారు. గత పదేళ్లకు పైగా ఎఫ్‌టీసీసీఐ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. పరిశ్రమలు--ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) చేయూత అందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, తెలంగాణ పారిశ్రామిక పోటీతత్వాన్ని మరింత పెంచడం తమ ప్రధాన లక్ష్యాలని నూతన నాయకత్వం వెల్లడించింది.

# సాఫ్ట్‌వేర్ పరిశోధనలకు వేదికగా ఐఐఐటీ--హైదరాబాద్‌లో ‘సెరి--2026’

హైదరాబాద్, జూలై 15

సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ రంగంలో తాజా పరిశోధనలు, సాంకేతిక పరిణామాలపై చర్చించేందుకు అంతర్జాతీయ సమాచార సాంకేతిక సంస్థ (ఐఐఐటీ--హైదరాబాద్) జూలై 16 నుంచి 18 వరకు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్ ఇండియా (సెరి--2026) సదస్సును నిర్వహించనుంది. ఐఐఐటీ--హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగే ఈ మూడు రోజుల సదస్సుకు దేశవ్యాప్తంగా పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు, పారిశ్రామిక రంగ నిపుణులు హాజరుకానున్నారు. ఇప్పటికే 200 మందికి పైగా నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ పరిశోధనలో విద్యా సంస్థలు--పరిశ్రమల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, తాజా ఆవిష్కరణలను పంచుకోవడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సదస్సులో ప్రముఖ పరిశోధకుల ఐదు ప్రత్యేక ఉపన్యాసాలు, 20 పరిశోధనా పత్రాల ప్రదర్శనలు, ఇన్ఫోసిస్ సహకారంతో ఏజెంటిక్ సిస్టమ్స్ టెస్టింగ్ అండ్ ఎవాల్యుయేషన్ అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. అలాగే నాస్కామ్ భాగస్వామ్యంతో ఇండస్ట్రీ డే కార్యక్రమంలో 10 నిపుణుల ప్రసంగాలు, రెండు కీలకోపన్యాసాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్యానెల్ చర్చలు ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్ నాణ్యత, టెస్టింగ్, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఏజెంటిక్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక అంశాలపై విస్తృతంగా చర్చలు జరుగనున్నాయి. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు, స్టార్టప్‌లు, సాంకేతిక సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని తమ అనుభవాలను పంచుకోనున్నారు.

# మెట్రోలో అదనపు కోచ్‌లు.. చివరి మైలు అనుసంధానానికి ప్రాధాన్యం

హైదరాబాద్, జూలై 15

హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు నగరంలో మెట్రో అభివృద్ధిని వేగవంతం చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో 69 కిలోమీటర్ల తొలి దశ మెట్రో మార్గంలోని ప్రయాణికుల సౌకర్యాలు, చివరి మైలు (లాస్ట్ మైల్) అనుసంధానం, స్టేషన్ల పరిశుభ్రత, భద్రత, పార్కింగ్, రద్దీ నిర్వహణ అంశాలను సమీక్షించారు. ప్రయాణికుల రద్దీని తగ్గించి, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు అదనపు మెట్రో కోచ్‌ల కొనుగోలుపై తయారీ సంస్థలతో వెంటనే చర్చలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మెట్రో స్టేషన్లకు చివరి మైలు రవాణా సౌకర్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు టీఎస్ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే మెట్రో స్టేషన్లను సమీప రైల్వే స్టేషన్లు, ప్రజా ప్రదేశాలతో అనుసంధానించే స్కైవాక్‌ల నిర్వహణతో పాటు అవసరమైన చోట విస్తరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మెట్రో స్టేషన్‌కు ప్రత్యేక అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఎంపిక చేసిన స్టేషన్లలో పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేసి, అనంతరం మొత్తం నెట్‌వర్క్‌కు విస్తరించాలని సూచించారు. త్వరలో తాను స్వయంగా మెట్రో స్టేషన్లను సందర్శించి నిర్వహణ, సేవలను పరిశీలిస్తానని తెలిపారు. సమావేశంలో హైటెక్ సిటీ, రాయదుర్గం, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొండాపూర్ ప్రాంతాల్లో పబ్లిక్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్టీఎస్) ప్రతిపాదనలు, మెట్రో రైలు భద్రతా విభాగం అమలు చేస్తున్న ప్రయాణికుల భద్రతా చర్యలపై కూడా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో పాటు పలువురు ముఖ్య ఇంజినీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నకిలీ నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

హైదరాబాద్, జూలై 15

నకిలీ, మార్పులు చేసిన లేదా అనధికారిక రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు ముమ్మరం చేశారు. పౌరుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. గత వారం రోజుల వ్యవధిలో జూబ్లీహిల్స్, మలక్‌పేట్, బేగంబజార్, అబిడ్స్, కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (హెచ్ఎస్ఆర్‌పీ) మాత్రమే చట్టబద్ధమైనవని పోలీసులు స్పష్టం చేశారు. నకిలీ, మార్పులు చేసిన లేదా నిబంధనలకు విరుద్ధంగా తయారు చేసిన నంబర్ ప్లేట్లు ఉపయోగించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడం, నేరాల నియంత్రణకు తోడ్పడడం, వాహనాల గుర్తింపును సులభతరం చేయడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. నగరవ్యాప్తంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.



## తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జద్ ఉల్లా ఖాన్

, హైదరాబాద్ జూలై 15

సామాజిక న్యాయం, మైనారిటీల హక్కులు, రాజకీయ సాధికారతపై చర్చ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఉమ్మడి కృషి అవసరమని అభిప్రాయం హైదరాబాద్: తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) అధికార ప్రతినిధి అమ్జద్ ఉల్లా ఖాన్, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమ్జద్ ఉల్లా ఖాన్‌కు తీన్మార్ మల్లన్న శాలువా కప్పి సత్కరించారు. అనంతరం రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, సామాజిక న్యాయం, మైనారిటీల హక్కుల పరిరక్షణ, రాజకీయ సాధికారత, జనాభాకు అనుగుణంగా మైనారిటీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి వంటి పలు కీలక అంశాలపై ఇరువురు నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. అదేవిధంగా మైనారిటీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, ఉపాధి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం పెంపు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ అంశాలపై టీఆర్పీ, ఎంబీటీ పార్టీలు ఉమ్మడిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నాం తెలంగాణలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా భవిష్యత్తులోనూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని, రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం, వెనుకబడిన వర్గాల సాధికారత, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్, ఎంబీటీ ప్రధాన కార్యదర్శి ముస్తఫా మెహమ్మద్, నాయకులు సికందర్ ఉల్లా ఖాన్, యువ నాయకులు సాఖిబ్ ఉల్లా ఖాన్, అఫ్ఘాన్ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా 'కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి' నియామకం

సంగారెడ్డి , , జూలై 15:



తెలంగాణ రక్షణ సేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాటం చేయాలనే లక్ష్యంతో పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కలబ్‌గూర్ దయాకర్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడు తూ తనపై విశ్వాసం ఉంచి అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసి సంగారెడ్డి నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ నియామకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు స్వాగతిస్తూ దయాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# తీన్మార్ మల్లన్న సమక్షంలో టీఆర్పీలో భారీగా చేరిన మెదక్ జిల్లా నేతలు



మెదక్ జూలై 15

బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా టీఆర్పీలో చేరికలు ప్రజా సమస్యలపై పోరాడే పార్టీగా టీఆర్పీకి మద్దతు మెదక్: బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ రాజ్యా ధికార పార్టీ (టీఆర్పీ)లో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు నాయకు లు, కార్యకర్తలు బుధవారం పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో భారీగా చేరారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ బసపురం నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన నత్తి అంబదాస్, వెంకటేష్, ప్రేమ్, ఆనంద్ కురుమ, రాజ లింగం గౌడ్, ఉసిప్, సుధాకర్ తదితరులు టీఆర్పీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని తీన్మార్ మల్లన్న సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన నాయకులు మాట్లాడుతూ, ఇన్నాళ్లూ తమకు రాజకీయంగా సరైన వేదిక లేదని, కష్టకాలంలో అగ్రవర్ణ పార్టీల నుంచి ఎలాంటి అండ లభించలేదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీయే తమకు నిజమైన రాజకీయ వేదికగా భావించి పార్టీలో చేరినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, "ఇన్నాళ్లు మనం ఇతరులను గెలిపించే స్థాయిలో ఉన్నాం. ఇకపై బీసీలంతా ఏకమై తమ నాయకత్వాన్ని తామే నిర్మించుకొని అధికారంలోకి రావాల్సిన సమయం వచ్చింది. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న టీఆర్పీ విధానాలను విశ్వసించి ఇతర పార్టీల నుంచి పెద్దఎత్తున నాయకులు చేరుతు న్నారు. పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం, గౌరవం కల్పిస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఇంచార్జ్ రాములు, మెదక్ జిల్లా యువజన అధ్యక్షుడు పోతుల రవీందర్, అనిల్, జహీరాబాద్ ఇంచార్జ్ నరసింహ, సంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు లతక్క, రజిత, హర్ష కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామచంద్రపురం యూఆర్ఎస్ పాఠశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



## టీఆర్వీఎస్

సూర్యాపేట: జూలై 15

వట్టె జానయ్య యాదవ్ ఆదేశాల మేరకు పాఠశాల సమస్యలపై ఆందోళన డీఈఓతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ సూర్యాపేట జిల్లా రామచంద్రపురంలోని యూఆర్ఎస్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ లివట్టె జానయ్య యాదవ్‌లి ఆదేశాల మేరకు తెలంగాణ రాజ్యాధికార విద్యార్థి సేన నాయకులు పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టీఆర్వీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మడిపల్లి సాయి తేజ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించిన నాయకులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. సుమారు 100 మంది విద్యార్థులకు కేవలం మూడు తరగతి గదులు మాత్రమే ఉండడం, కొంతమంది విద్యార్థులకు చెట్ల కిందే బోధన కొనసాగడం, పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు లేకపోవడం, వాష్‌రూమ్‌ల కొరత, అపరిశుభ్రమైన పరిసరాలు, కోతుల బెడదతో విద్యార్థులు భయాం దోళనలకు గురవుతున్న పరిస్థితిని గుర్తించా రు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)తో టెలిఫో న్‌లో మాట్లాడిన మడిపల్లి సాయి తేజ, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈఓ రెండు నుంచి మూడు రోజుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మడిపల్లి సాయి తేజ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థులకు కనీస మౌలిక వసతులు కల్పించ డం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొ న్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో టీఆర్వీఎస్ సూర్యా పేట జిల్లా అధ్యక్షుడు మడిపల్లి సాయి తేజతో పాటు తాళ్లూరి అభి, బత్తుల చైతన్, చింతకాయల శివా, బిట్టు యశ్వంత్, చైను మనోజ్, కొత్తపల్లి ఉమేష్, చందపల్లి రోహిత్, అత్కూరి కార్తీక్, గుణగాని ఉదయ్, భరణి తదితరులు పాల్గొన్నారు.




## బీసీ సంక్షేమ కమిటీలో తీన్మార్ మల్లన్నకు చోటు..

ఘనంగా సన్మానించిన టీఆర్పీ సంగారెడ్డి జిల్లా నాయకులు

హైదరాబాద్ : , జూలై 15

హైదరాబాద్: బీసీల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ కమిటీలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అధినేత, గౌరవ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభ్యుడిగా ఎంపిక కావడం పట్ల టీఆర్పీ సంగారెడ్డి జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీసీల హక్కులు, సంక్షేమం కోసం ఆయన మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా నాయకురాలు లత, టౌన్ మహిళా నాయకురాలు రజిత, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహ, యూసుఫ్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తీన్మార్ మల్లన్నకు అభినందనలు తెలిపారు



## ప్రైవేట్ ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు

సంగారెడ్డి ప్రతినిధి, , జూలై 15:

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్, భానూర్ గ్రామాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. కె. లలితా దేవి ఆధ్వర్యం లో ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు, క్లినిక్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సంద ర్భంగా ఇస్నాపూర్‌లోని వి కేర్ మీనాక్షి హాస్పిటల్‌లో గర్భిణీలకు సంబంధించి న ఫామ్-ఎఫ్ రికార్డులు సక్రమంగా నిర్వహిం చకపోవడ ంతో స్కానింగ్ గదిని సీజ్ చేశారు. అదే గ్రామం లో అనుమతులు లేకుండా నిర్వ హిస్తున్న రెండు ఆర్ఎంపీ క్లినిక్లను సీజ్ చేసి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకు నేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. భానూ ర్‌లోని సన్ షూర్ క్లినిక్ యోగి రాజ్ ఫిజియోథెరపీ అండ్ రిహాబి లిటేషన్ క్లినిక్‌లో గుర్తించిన లోపాలపై నోటీసు జారీ చేసి జరిమానా విధించారు.

# టీఆర్పీలోకి గట్కేసర్ ప్రాంతానికి చెందిన పలువురు నాయకుల చేరిక



తీన్మార్ మల్లన్న సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

హైదరాబాద్, జూలై 15

బొమ్మ వెంకటేశ్వర్లు నేతకు గట్కేసర్ డివిజన్ అధ్యక్షుడిగా నియామకం హైదరాబాద్: తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో గట్కేసర్ మున్సిపాలిటీ పరిధికి చెందిన పలువురు నాయకులు బుధవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ బంధారపు నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గట్కేసర్ ప్రాంతానికి చెందిన రాములు యాదవ్, మల్లయ్య నేత, వెంకట్ రెడ్డి, రాజు సాగర్, నరసింహ గౌడ్, వి. ఉపేందర్ నేత టీఆర్పీ కండువా కప్పుకొని పార్టీలో చేరగా, పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న వారిని సాదరంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా బొమ్మ వెంకటేశ్వర్లు నేతను గట్కేసర్ డివిజన్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సంస్థ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆఫీస్ కోఆర్డినేటర్ లింగం యాదవ్, నాగోల్ డివిజన్ అధ్యక్షుడు సురేందర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీలు

సంగారెడ్డి ప్రతినిధి, , జూలై 15

సంగారెడ్డి జిల్లా వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పటాన్‌చెరు సబ్‌డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయాన్ని సందర్శించి డీఎస్పీ ప్రభాకర్‌తో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం కార్యాలయ రికార్డులు, దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులను పరిశీలించి వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచారం, డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమైన, చట్టబద్ధమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ పరివాహక ప్రాంతమైన పటాన్‌చెరులో ట్రాఫిక్ సమస్యలు, పరిశ్రమల కారణంగా వలస కార్మికుల రాకపోకలు అధికంగా ఉండటంతో ఆస్తి సంబంధిత నేరాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొంటూ క్రైమ్ ప్రోన్ ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి పగలు, రాత్రి బీట్‌లను పటిష్ఠం చేయాలని ఆదేశించారు.

# గంభీర్, నెహ్రా ప్రోత్సాహమే నా విజయానికి బలం

## సుందర్




భారత క్రికెట్‌లో కొత్త సంచలనంగా అవతరించిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఐపీఎల్ 19వ సీజన్‌లో తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన ఈ యువ సంచలనంపై ఇప్పుడు క్రికెట్ దిగ్గజాలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్, భారత జట్టు సారథి శుభ్‌మన్ గిల్ వైభవ్ ప్రతిభను కొనియాడగా, తాజాగా క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ కూడా అతడిపై ప్రశంసల జల్లు కురిపించారు.

**లండన్, జులై 15 :**

ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో అర్ధశతకంతో భారత్ విజయానికి కీలక పాత్ర పోషించిన వాషింగ్టన్ సుందర్ తన బ్యాటింగ్‌లో వచ్చిన మార్పుకు భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిష్ నెహ్రాకు పూర్తి క్రెడిట్ ఇచ్చాడు. తన ఆటను పూర్తిగా అర్థం చేసుకునేలా ఇద్దరూ మార్గనిర్దేశం చేశారని, తనపై నమ్మకం ఉంచి మరింత మెరుగైన ఆటగాడిగా తీర్చిదిద్దారని తెలిపాడు. ప్రతి మ్యాచ్‌కు ముందు సన్నద్ధతకే అత్యంత ప్రాధాన్యం ఇస్తానని సుందర్ వెల్లడించాడు. గౌతమ్ గంభీర్ తన బ్యాటింగ్ సామర్థ్యాన్ని గుర్తించి ఏ పరిస్థితుల్లో ఎలా ఆడాలో స్పష్టంగా వివరించారని చెప్పాడు. ఆశిష్ నెహ్రా మాత్రం ఆటగాడిగా మాత్రమే కాకుండా వ్యక్తిగా కూడా తనను తాను అర్థం చేసుకునేలా చేశారని పేర్కొన్నాడు. అలాంటి వ్యక్తులు తనకు అండగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నాడు. ఆల్‌రౌండర్‌గా ప్రతి రోజు తన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంటుందని సుందర్ అభిప్రాయపడ్డాడు. విభిన్న పరిస్థితుల్లో ఆడే అవకాశం రావడం వల్ల విలువైన అనుభవం సంపాదించానని, అదే తన ఆటను మరింత మెరుగుపరిచిందని చెప్పాడు. ఓపెనర్‌గా, మధ్యవరుస బ్యాటర్‌గా, ఫినిషర్‌గా జట్టు ఏ బాధ్యత అప్పగించినా నిర్వర్తించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశాడు.




# ఫ్రాన్స్‌ను మట్టికరిపించిన స్పెయిన్

**టెక్సాస్, జులై 15 :**

ఫిఫా ప్రపంచకప్--2026లో స్పెయిన్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్‌ను 2--0 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో స్పెయిన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత మరోసారి ఫైనల్‌లో అడుగుపెట్టడం స్పెయిన్‌కు ఇదే తొలిసారి.

మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన స్పెయిన్‌కు 22వ నిమిషంలో పెనాల్టీ లభించింది. యువ ఆటగాడు లామిన్ యమాల్‌పై ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీ ఇచ్చారు. ఆ అవకాశాన్ని మికెల్ ఒయర్‌జాబల్ సద్వినియోగం చేసుకుని తొలి గోల్ నమోదు చేశాడు. అనంతరం 58వ నిమిషంలో డానీ ఓల్మోతో చక్కటి పాస్‌ల మార్పిడి అనంతరం పెడ్రో పోరో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి స్పెయిన్ ఆధిక్యాన్ని 2--0కు పెంచాడు.

ఫ్రాన్స్ తరఫున కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలే, మైఖేల్ ఒలిసే వంటి స్టార్ ఆటగాళ్లు బరిలో ఉన్నప్పటికీ స్పెయిన్ కట్టుదిట్టమైన రక్షణను ఛేదించలేకపోయారు. స్పెయిన్ డిఫెన్స్ ముందు ఫ్రాన్స్ దాడులు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో వరుసగా మూడో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరాలన్న ఫ్రాన్స్ ఆశలు గల్లంతయ్యాయి. 14 ఏళ్లుగా జట్టును నడిపిస్తున్న కోచ్ డిడియర్ డెషాంప్స్‌కు ఈ ఓటమి నిరాశ మిగిల్చింది.

విజయం అనంతరం స్పెయిన్ ప్రధాన కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె జట్టు సమష్టి ప్రదర్శనను ప్రశంసించాడు. ఫ్రాన్స్ బలమైన దాడులను సమర్థంగా అడ్డుకోవడంలో ఆటగాళ్లు విజయవంతమయ్యారని పేర్కొన్నాడు. ఆదివారం న్యూజెర్సీలోని న్యూయార్క్--న్యూజెర్సీ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా--ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.

# డబ్ల్యూటీసీకి సెమీఫైనల్స్





## ఐసీసీ కీలక ప్రతిపాదనలు

**ఎడిన్‌బర్గ్, జులై 15 :**

అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ, ఉత్కంఠ పెంచే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్స్‌ను ప్రవేశపెట్టడం, వన్డే ప్రపంచకప్‌లో జట్ల సంఖ్యను తగ్గించడం, కొత్త టోర్నీ విధానాలను అమలు చేయడం వంటి పలు ప్రతిపాదనలు ఐసీసీ వార్షిక సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం రెండేళ్ల చక్రంలో జరుగుతున్న వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాయింట్ల పట్టికలో తొలి రెండు జట్లు మాత్రమే ఫైనల్‌కు చేరుతున్నాయి. అయితే టోర్నీపై మరింత ఆసక్తి పెంచేందుకు ఇకపై తొలి నాలుగు జట్ల మధ్య సెమీఫైనల్స్ నిర్వహించి, విజేతలను ఫైనల్‌కు పంపే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మార్పు అమల్లోకి వస్తే డబ్ల్యూటీసీ మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వే జట్లను కూడా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో చేర్చేందుకు ఐసీసీ వర్కింగ్ గ్రూప్ కసరత్తు చేస్తోంది. టెస్ట్ క్రికెట్ విస్తరణకు ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. వన్డే ప్రపంచకప్‌లో కూడా మార్పులు ప్రతిపాదించారు. ప్రస్తుతం 14 జట్లతో నిర్వహిస్తున్న టోర్నీని 12 జట్లకు పరిమితం చేయడంతో పాటు 'సూపర్ సెవెన్' పేరుతో కొత్త దశను ప్రవేశపెట్టాలని ఐసీసీ పరిశీలిస్తోంది. 2027లో దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా నిర్వహించే ప్రపంచకప్ నుంచే ఈ మార్పులు అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అర్జెంటీనాపై వివాదం



## తొలగించాలని లక్షలాది సంతకాలతో పిటిషన్

**న్యూయార్క్, జులై 15 :**

ప్రపంచకప్--2026 సెమీఫైనల్‌కు ముందు డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వివాదంలో చిక్కుకుంది. జట్టుకు రిఫరీలు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్జెంటీనాను ప్రపంచకప్ నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ 75 లక్షల మందికిపైగా సంతకాలతో ఒక ఆన్‌లైన్ పిటిషన్ దాఖలైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ అంశం ప్రపంచ ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పిటిషన్‌లో ఫిఫా, రిఫరీలు లియోనెల్ మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా జట్టుకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపించారు. విజేతను ముందుగానే నిర్ణయిస్తే మిగతా జట్లు ఎందుకు పోటీపడాలని ప్రశ్నిస్తూ, అన్ని జట్లకు సమాన అవకాశాలు కల్పించాలంటే అర్జెంటీనాను టోర్నీ నుంచి తొలగించాలని అందులో కోరినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ ఆరోపణలపై ఫిఫా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అలాగే పిటిషన్‌లో చేసిన ఆరోపణలకు స్వతంత్రంగా ఎలాంటి ఆధారాలు వెలుగులోకి రాలేదు. ఇదిలా ఉండగా సెమీఫైనల్‌లో అర్జెంటీనా, ఇంగ్లండ్ జట్లు తలపడనున్నాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌లో ఈ రెండు జట్ల మధ్య పోటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

# బుమ్రా సలహాలతోనే రాణించా:

**లండన్, జులై 15 :**

ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో అద్భుత బౌలింగ్‌తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన యువ పేసర్ గుర్నూర్ బ్రార్ తన విజయ రహస్యాన్ని వెల్లడించాడు. ఇంగ్లండ్ పరిస్థితుల్లో ఎలా బౌలింగ్ చేయాలనే విషయంలో సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఇచ్చిన సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపాడు. అలాగే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తనపై పూర్తి నమ్మకం ఉంచి ప్రోత్సహించారని చెప్పాడు. తొలి వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఓపెనర్లు బెన్ డకెట్, జాకబ్ బెథెల్ శుభారంభం అందించారు. వికెట్ నష్టపోకుండా 61 పరుగులు చేసిన దశలో బౌలింగ్‌కు వచ్చిన గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్లో ఇద్దరు ఓపెనర్లను పెవిలియన్‌కు పంపి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. ఆ దెబ్బ నుంచి కోలుకోలేక ఇంగ్లండ్ 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. అనంతరం జో రూట్ అజేయంగా 76, లియామ్ డాసన్ 68 పరుగులు చేయడంతో ఆ జట్టు 258 పరుగుల స్కోరు నమోదు చేసింది.





# ఓపికతోనే విజయాన్ని అందుకున్నా:

## అక్షర్ పటేల్

**లండన్, జులై 15 :**

ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించిన అక్షర్ పటేల్ తన విజయ రహస్యాన్ని వెల్లడించాడు. తొందరపడకుండా ఓపికగా ఆడటంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ప్రణాళికను అమలు చేయడమే తన విజయానికి కారణమని తెలిపాడు. ప్రతి బంతిపై పూర్తి దృష్టి పెట్టడంతోనే జట్టును గెలిపించే ప్రదర్శన చేయగలిగానని చెప్పాడు. టీ20 సిరీస్‌లో తాను బంతిని బలంగా కొట్టాలనే ప్రయత్నం ఎక్కువ చేశానని అక్షర్ అంగీకరించాడు. డెత్ ఓవర్లలో అలాంటి విధానం అవసరమే అయినప్పటికీ, అదే అలవాటు తన బ్యాటింగ్‌పై ప్రభావం చూపిందని పేర్కొన్నాడు. అయితే తొలి వన్డేలో భారత్‌కు మంచి ఆరంభం లభించడంతో ముందుగా భాగస్వామ్యాన్ని నిర్మించడంపైనే దృష్టి పెట్టానని, బంతిని బలంగా బాదాలనే ఆలోచన కంటే సరైన టైమింగ్‌తో షాట్లు ఆడేందుకు ప్రాధాన్యం ఇచ్చానని వివరించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తక్కువ స్కోర్లకే ఔటవడం, శుభ్‌మన్ గిల్ గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో జట్టు క్లిష్ట పరిస్థితుల్లో పడిందని అక్షర్ గుర్తు చేశాడు.



# తొలి వన్డేలో మా ఓటమికి ప్రధాన కారణం అదే

## ఇంగ్లండ్ కెప్టెన్ బ్రూక్




**ఎడ్జ్‌బాస్టన్, జులై 15 :**

ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ రాణించ డంతో 259 పరుగుల లక్ష్యాన్ని భారత్ 45.2 ఓవర్లలోనే ఛేదించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని మంచి ఆరంభం చేసింది. వికెట్ నష్టపోకుండా 61 పరుగులు చేసిన ఆ జట్టు, ఆ తర్వాత భారత బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లు కోల్పోయింది. కేవలం 20 పరుగుల వ్యవధిలో ఐదు వికెట్లు చేజారడంతో 80/5 స్కోరుతో కష్టాల్లో పడింది. అయితే జో రూట్ అజేయంగా 76 పరుగులు, లియామ్ డాసన్ 68 పరుగులు చేసి ఆరో వికెట్‌కు 121 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 258 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. 259 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభ్‌మన్ గిల్ చక్కటి ఆరంభాన్ని అందించాడు. 80 పరుగులు చేసిన గిల్ గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగినా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ జట్టును ఆదుకున్నారు. అక్షర్ అజేయంగా 57 పరుగులు, సుందర్ అజేయంగా 52 పరుగులు చేసి ఐదో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.



# అనిల్‌పై తమ్మారెడ్డి సరదా వ్యాఖ్యలు

**హైదరాబాద్, జులై 15**

తెలుగు చిత్రసీమలో తన ముక్కుసూటి వ్యాఖ్యలతో ప్రత్యేక గుర్తింపు పొందిన సీనియర్ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ఎలాంటి విషయాన్నైనా నేరుగా చెప్పే స్వభావం ఉన్న ఆయన.. తాజాగా 'వదల' సినిమా విడుదలకు ముందస్తు నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు అనిల్ రావిపూడిపై చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. ప్రస్తుతం వరుస విజయాలతో అగ్ర వాణిజ్య దర్శకుడిగా కొనసాగుతున్న అనిల్ రావిపూడితో పని చేయాలని పలువురు అగ్ర కథానాయకులు ఆసక్తి చూపుతున్న వేళ.. ఆయనను ఉద్దేశించి తమ్మారెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. "అనిల్ రావిపూడి ఇప్పుడు చాలా పెద్ద దర్శకుడు అయిపోయాడు. ఈ కార్యక్రమానికి వస్తాడో లేదో అనుకున్నాను. 'గురువుగారు మీరు ఫోన్ చేయండి' అన్నాడు. కానీ నేను ఫోన్ చేస్తే ఎత్తలేదు. తర్వాత సాయంత్రం ఆయనే తిరిగి ఫోన్ చేసి మాట్లాడి కార్యక్రమానికి తప్పకుండా వస్తానని చెప్పాడు. చెప్పిన మాట నిలబెట్టుకున్నాడు" అని తమ్మారెడ్డి తెలిపారు.

# నాని సినిమా విడుదల మళ్లీ వాయిదా?

**హైదరాబాద్, జులై 15**

ప్రముఖ నటుడు నాని కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా నాని పోషిస్తున్న 'జడల్' పాత్రకు సంబంధించిన ప్రచార చిత్రాలు, విడుదలైన గీతం, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న తీరు సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. 'దసరా' విజయానంతరం నాని--శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో చిత్రం కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదల మరోసారి వాయిదా పడనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

మొదట ఈ చిత్రాన్ని ఈ ఏడాది మార్చిలో విడుదల చేయాలని చిత్రబృందం భావించింది. అనంతరం విడుదల తేదీని ఆగస్టు 21కు మార్చింది. అయితే ప్రస్తుతం చిత్రీకరణ పూర్తికాకపోవడం, నిర్మాణానంతర పనులు కొనసాగుతుండటం, ప్రచార కార్యక్రమాలకు మరింత సమయం అవసరం కావడం వంటి కారణాలతో విడుదలను మరోసారి వాయిదా వేసినట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నటుడు మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు.





| Ranking | | Weeks | Views |
|---|---|---|---|
| 01 | Nothing to Lose | 1 | 65,00,000 |
| 02 | Ikka | 1 | 44,00,000 |
| 03 | Wonderful Nightmare | 1 | 22,00,000 |
| 04 | Daadi Ki Shaadi | 2 | 21,00,000 |
| 05 | Peddi | 1 | 19,00,000 |
| 06 | Pati Patni Aur Woh Do | 1 | 18,00,000 |
| 07 | The Marked Woman | 6 | 13,00,000 |
| 08 | Blast | 3 | 11,00,000 |
| 09 | Colors Of Evil: Black | 5 | 10,00,000 |
| 10 | Husbands in Action | 4 | 9,00,000 |

# ఓటీటీలో 'పెద్ది'కి ఆశించిన ఆదరణ కరువు

**హైదరాబాద్, జులై 15**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కిన 'పెద్ది' చిత్రం థియేటర్లలో ఘన విజయం సాధించి ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. భారీ అంచనాల మధ్య ఓటీటీలోకి అడుగుపెట్టిన ఈ చిత్రం కూడా అదే స్థాయిలో ఆదరణ పొందుతుందని అభిమానులు భావించారు. అయితే డిజిటల్ వేదికపై మాత్రం ఈ సినిమాకు ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదని తాజా గణాంకాలు చెబుతున్నాయి. జులై 9 నుంచి ఓటీటీలో ప్రసారమవుతున్న 'పెద్ది' చిత్రం తొలి నాలుగు రోజుల్లో కేవలం 19 లక్షల వీక్షణలు మాత్రమే నమోదు చేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వీక్షించిన ఆంగ్లేతర చిత్రాల జాబితాలో ఐదో స్థానానికి మాత్రమే పరిమితమైంది. భారీ నిర్మాణ వ్యయంతో, విస్తృత ప్రచారంతో విడుదలైన చిత్రానికి ఇది ఆశించిన స్థాయి ఆరంభం కాదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఫలితంపై ఎక్కువగా చర్చ జరుగుతున్న అంశం హిందీ రూపాన్ని విడుదల చేయకపోవడమే. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో చిత్రాన్ని అందుబాటులోకి తీసుకురాగా, హిందీ ప్రేక్షకులకు మాత్రం అవకాశం లేకపోయింది. దేశంలో అత్యధిక మంది ఓటీటీ ప్రేక్షకులు ఉన్న హిందీ మార్కెట్‌కు సినిమా చేరుకోకపోవడం వల్ల లక్షలాది మంది వీక్షకులను కోల్పోయినట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. థియేటర్లలో హిందీ రూపానికి పెద్దగా ఆదరణ లభించకపోయినా, ఓటీటీలో విడుదల చేస్తారని ఆశించిన ప్రేక్షకులు నిరాశ చెందారు.



# బన్నీతో బసిల్ సినిమా?

**ఈ ఒక్క పోస్టు ప్రస్తుతం తెలుగు, మలయాళ చిత్రసీమల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఐకాన్' అనేది అల్లు అర్జున్ అభిమానులు పిలిచే బిరుదు కావడంతో, ఆయనతో చేయబోయే సినిమాపై ఇదే పరోక్ష సంకేతమని అభిమానులు, సినీ వర్గాలు భావిస్తున్నాయి. అల్లు అర్జున్, బసిల్ జోసెఫ్ కలిసి సినిమా చేయనున్నారనే వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి.**

### పోస్టుతో ఊహాగానాలు

**హైదరాబాద్, జులై 15 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా చేయబోతున్నారనే ప్రచారం మరోసారి సినీ వర్గాల్లో జోరందుకుంది. ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోయినా, తాజాగా బసిల్ జోసెఫ్ సామాజిక మాధ్యమంలో చేసిన ఒక పోస్టు ఈ వార్తలకు మరింత ఊతమిచ్చింది. బసిల్ జోసెఫ్ తన ఇన్‌స్టాగ్రామ్ కథనంలో 'ఐకాన్' అని రాసి ఉన్న టోపీ చిత్రాన్ని పంచుకున్నారు. ఈ ఒక్క పోస్టు ప్రస్తుతం తెలుగు, మలయాళ చిత్రసీమల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఐకాన్' అనేది అల్లు అర్జున్ అభిమానులు పిలిచే బిరుదు కావడంతో, ఆయనతో చేయబోయే సినిమాపై ఇదే పరోక్ష సంకేతమని అభిమానులు, సినీ వర్గాలు భావిస్తున్నాయి. అల్లు అర్జున్, బసిల్ జోసెఫ్ కలిసి సినిమా చేయనున్నారనే వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల అల్లు శిరీష్ వివాహ వేడుకలో బసిల్ జోసెఫ్ పాల్గొనడం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. ఇద్దరి మధ్య కథా చర్చలు ఇప్పటికే జరిగినట్లు సమాచారం. అయితే ఈ ప్రాజెక్టును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. 'మిన్నల్ మురళి' చిత్రంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బసిల్ జోసెఫ్, అల్లు అర్జున్‌తో 'శక్తిమాన్' కథను తెరకెక్కించనున్నారనే వార్తలు గతంలో వచ్చాయి. అయితే వాటిని దర్శకుడు స్వయంగా ఖండించారు. బన్నీతో తాను చేయబోయేది పూర్తిగా కొత్త కథేనని, కథకు సంబంధించిన వివరాలను సరైన సమయంలో వెల్లడిస్తామని స్పష్టం చేశారు. ఈ చిత్రాన్ని అల్లు కుటుంబానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిపై స్పష్టత రానప్పటికీ, ప్రాజెక్టు దాదాపు ఖరారైనట్లేనని చర్చ సాగుతోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఆ సినిమా పూర్తయిన తర్వాత దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో ప్రతిష్ఠాత్మక చిత్రంలో నటించనున్నారు. ఈ రెండు చిత్రాల అనంతరం బసిల్ జోసెఫ్ దర్శకత్వంలోని సినిమా పట్టాలెక్కే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

# 'జననాయకన్' విడుదలపై కొత్త సంకేతాలు

**చిత్ర విడుదల తేదీకి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జగదీష్ పళనిసామి చేసిన పోస్టు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా, విడుదల తేదీపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలోనే చిత్ర బృందం అధికారిక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక చిత్ర నిర్మాణానికి సంబంధించి మరో కీలక సమాచారం కూడా వెలుగులోకి వచ్చింది. తుది కూర్పులో కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను చేర్చిన నేపథ్యంలో ఈ చిత్రాన్ని మరోసారి సెన్సార్ పరిశీలనకు పంపినట్లు సమాచారం.**

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ నటిస్తున్న చివరి చిత్రంగా ప్రచారం పొందుతున్న 'జననాయకన్' విడుదలపై కొత్త సమాచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ చిత్రం జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుందని గత కొద్ది రోజులుగా ప్రచారం సాగుతున్నప్పటికీ, అంతకంటే ఒక రోజు ముందుగానే జులై 23న విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు చిత్ర సహ నిర్మాత, విజయ్ వ్యక్తిగత నిర్వాహకుడు జగదీష్ పళనిసామి సామాజిక మాధ్యమాల వేదికగా పరోక్ష సంకేతాలు ఇచ్చారు. దీంతో అభిమానుల్లో చిత్ర విడుదలపై మరింత ఉత్సాహం నెలకొంది. చిత్ర విడుదల తేదీకి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జగదీష్ పళనిసామి చేసిన పోస్టు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా, విడుదల తేదీపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలోనే చిత్ర బృందం అధికారిక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక చిత్ర నిర్మాణానికి సంబంధించి మరో కీలక సమాచారం కూడా వెలుగులోకి వచ్చింది. తుది కూర్పులో కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను చేర్చిన నేపథ్యంలో ఈ చిత్రాన్ని మరోసారి సెన్సార్ పరిశీలనకు పంపినట్లు సమాచారం. అనంతరం చిత్రానికి పెద్దలకు మాత్రమే అనుమతించే ధ్రువీకరణ పత్రం లభించినట్లు ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ సినిమాపై అభిమానుల్లో ఉన్న ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు. ఈ భారీ రాజకీయ యాక్షన్ నేపథ్యంలో రూపొందిన చిత్రానికి హెచ్. వినోద్ దర్శకత్వం వహించారు. కథానాయికగా పూజా హెగ్డే నటించగా, మమితా బైజు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ సమకూర్చగా, ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.




"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467